

# తృప్తి

-కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం

"ఏమండీ! అలా బైటకెళ్తున్నారా?"

"అవును. ఏమైనా తీసుకురావాలా ఏంటి?"

"భలేవారండీ. మూడ్రోజుల నుంచీ చెబుతూనే ఉన్నా. హార్లిక్స్ దగ్గర పడుతోందనీ" కాస్త అలిగినట్లు ముఖం పెట్టింది భార్యామణి.

"అవునోయ్. దగ్గరపడుతోందన్నావు గానీ పూర్తిగా నిండుకుందని నీవన్లేదుగా" సమర్థించుకుంటూ అన్నాడు.

"అంటే? పూర్తిగా అయిపోయాక చెప్పాలా? అప్పుడు పరిగెడతారన్నమాట" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది.

"సరేనోయ్. ఒకవేళ పూర్తిగా అయిపోయిందే అనుకో. నేను తేవడం కూడా లేటవుతుంది. ఏం? కాఫీనో, టీనో వట్టిపాలో ఇవ్వచ్చుగా. తాగరా పిల్లలూ" అసహనంగా అన్నాడు.

"అంతేలేండి. మీకామాత్రం తెలీదా? చిన్నప్పట్నుంచీ నాకు హార్లిక్స్ తప్పితే వేరేదీ అలవాట్లేదు. ఆ అలవాటే మనపిల్లలకీ వచ్చింది. ఇప్పుడు కాఫీ టీలిస్తే తాగుతారేంటి?" వాపోయింది శ్రీమతి.

"అది సరే గానీ బైటకెళ్తున్నాను. ఓ గంటలో వచ్చేస్తాను. వచ్చేటప్పుడు తప్పకుండా అరకేజీ రీఫిల్‌ప్యాక్ తీసుకొస్తాను. ఈ పూటకైతే ఉందిగా"

"ఈపూటకైతే ఏదో అడ్జస్ట్ చేస్తాన్లెండి" అంటూ అమాయకంగా ముఖం పెట్టింది.

* * *

పాపం పెళ్లయిన కొత్తలో ఏ సామాన్లయినా పూర్తిగా నిండుకున్నాకనే చెప్పేది పద్మావతి. దాంతో "పూర్తిగా అయిపోయాక కాకుంటే ఓ రెండ్రోజులు ముందుగా చెప్పొచ్చుగా?" అంటూ కోప్పడేవాడు వెంకటరమణ.

భార్యామణి చిర్రుబుర్రులాడడం, కాస్త అలగడం, వెంకటరమణ విసుక్కోవడం, కోపగించుకోవడం, తరువాత రొటీన్‌లో పడి ఇల్లాలు ఆ సంగతే మరచిపోవడం వెంకటరమణ ఎంతో బాధగా సంజాయిషీ చెప్పుకోవడం ఛ...ఛ మీరు సారీ చెప్పడం ఏంటండీ..అంటూ ఆమె చిన్నగా నవ్వేయడం పరిపాటైపోయింది.

* * *

అలా బయటికెళ్లి తన పన్లన్నీ పూర్తిచేసుకుని ఇంటిముఖం పట్టాడు వెంకటరమణ. ఇంటి సమీపంలోకి వచ్చేసరికి హార్లిక్స్ సంగతి గుర్తుకొచ్చి గతుక్కుమన్నాడు. వెంటనే బైక్ వెనక్కి తిప్పేశాడు.

"అరకిలో హార్లిక్స్ రీఫిల్ ప్యాక్ ఒకటివ్వండి" అడిగాడు షాపువాణ్ణి.

చేతిలో హార్లిక్స్ ప్యాక్ పెడుతూంటే "మార్జిన్ తీసేస్తే ఎంతివ్వాలో చెప్పండి" అడిగాడు చదువుకున్నవాడు కనుక.

"ఎంఆర్‌పి 102రూపాయలు 99 ఇవ్వండి" అన్నాడు షాపువాడు తన నిజాయితీని చాటుకుంటూ. ఇంతలోనే ఊహించని చిత్రమైన సంఘటన ఒకటి జరిగిందక్కడ.

* * *

"అంకుల్ ఆఠాణా చాక్లెట్లు రెండివ్వండి" ఐదేళ్ల పిల్లాడొకడు షాపుకొచ్చి అడిగాడు.

"ఈనాణెం చెల్లదు. ఇదెలా సాగిపోయిందో చూడు?" అంటూ షాపువాడు వాపసు ఇచ్చేశాడు. తెల్లమొహం వేశాడు చిన్నవాడు.

పాపం ఆ పిల్లాడి దగ్గర ఆ ఒక్కనాణెం తప్పితే మరొకటి లేదని గ్రహించాడు వెంకటరమణ.

"మరేం ఫర్వాలేదు బాబూ!ఆ రూపాయి ఇలా ఇవ్వు. ఇదిగో ఈ రూపాయి తీసుకో" అని తనంటుంటే-

"అంకుల్ ఇది రూపాయి కాదు. రెండ్రూపాయల బిళ్ళ" ఎంతో అభినయంతో చంటోడు చెబుతుంటే

"ఓర్నీ తస్సాదియ్యా. భలేవాడివిరా!" అంటూ ఇంకో రూపాయి తీసి ఆ పిల్లాడి చేతిలో పెట్టేయడంతో ఒక్కరూపాయితో రెండు చాక్లెట్లూ కొనేస్కుని-

"థ్యాంక్స్ అంకుల్" అంటూ తుర్రుమన్నాడు.

తీరాచూస్తే రెండ్రూపాయల బిళ్ళలా భ్రమింపచేసే రూపాయి బిళ్ళే అది.

'నిండా ఐదేళ్లయినా లేని ఈ పసిహృదయంలో ఎంత మోసం. నీతినిజాయితీలకు బీజాలావపన చేయాల్సిన పెద్దవాళ్లంతా ఏం చేస్తున్నట్టు? పాపం చిన్నోడని నేను జాలిపడి ఇస్తే నేను వట్టి వెర్రిబాగుడ్నని కదా ఈ చిన్నోడి ఉద్దేశం?' అనుకుంటూ చెల్లని ఆ రూపాయి నాణాన్ని ఓసారి అటూ ఇటూ తిప్పి చూసుకుని పెదవి విరిచి మరీ జేబులో వేసుకున్నాడు వెంకటరమణ.

* * *

"నా ప్రాణ స్నేహితుడూ పరోపకారశీలీ, మంచికీ, మానవత్వానికీ ప్రతిరూపం నరసింహారావంటే. అలాంటివాడికి యాక్సిడెంటయి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుంటే ఒక్కసారి చూసొచ్చిన తృప్తి మాత్రం నాకు మిగిలింది. పదేపదే వెళ్లాలన్నా అక్కడే కోలుకునేదాకా ఉండాలన్నా బలవత్తర కారణాలు నన్ను వెనక్కిపట్టి లాగేశాయి. ఎప్పుడు డయల్ చేసినా ఫోన్ కలవకపోవడానికి కారణం ఏంటో అంతుబట్టడం లేదు. పోనీ మరొక్కసారి ట్రై చేస్తా" అనుకుంటూ జేబులు తడుముతుంటే నోట్లయితే బాగానే ఉన్నాయిగానీ చిల్లర విషయానికొస్తే మాత్రం ఆ 'చెల్లని నాణెం' ఒక్కటే ఉంది. బాక్స్‌మీద మాత్రం కొత్తరూపాయి నాణెం వేయండి అని ఉంది. కొత్త రూపాయిబిళ్ళలు రెండూ ఆ కుర్రోడు తన్నుకుపోయినందుకు కాస్త చిన్నబుచ్చుకుని కలిస్తే బాగుండును అనుకుని డయల్ చేశాను. ఫోన్ కలిసి తన ఆరోగ్యం మెరుగవుతోందని క్లోజ్‌ఫ్రెండ్ నరసింహారావు స్వయంగా చెప్పడంతో....

'ఇది చెల్లని నాణెం కాదు. చాలా విలువైన నాణెం. ఎంతో శక్తివంతమైన నాణెం. నా ప్రాణమిత్రుని క్షేమసమాచారాన్ని ఆనందంగా ఆ పిల్లవాని రూపంలో నాకు చేరవేసిన లక్ష్మీప్రసాదం' అనుకుంటూ తన ప్రాణమిత్రుడు తన కళ్లముందు కదలాడడంతో హాయిగా, తృప్తిగా ఇంటిముఖం పట్టాడు వెంకటరమణ.

★